క్లుప్తంగా

వసతి గృహం తనిఖీ



వసతి గృహం విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: స్థానిక కొండయ్యపాలెంలో సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు, వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులను మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు, అందుతున్న వసతులు, సదపాయాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ వార్డెన్ టి.రాధ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. కేంద్రం లోపల, బయట పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు సూచించారు. గ్రామంలో చెత్తను సంపద కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు తయారీ ద్వారా పంచాయతీ ఆదాయం పొందవచ్చన్నారు.

జీజీహెచ్‌కు పడకల వితరణ



ఆస్పత్రికి చేరిన పడకలు. చిత్రంలో డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ లావణ్యకుమారి తదితరులు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో రోగుల సౌకర్యార్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ గాడిమొగ విభాగం శుక్రవారం పడకలు, దిండ్లు అందజేశారు. సంస్థ ప్రతినిధి నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం 50 పడకలు, దిండ్లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్‌లకు ఆస్పత్రి ఆవరణలో అందించారు. డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బౌద్ధ మహాసభ

బోట్‌క్లబ్: భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో కాకినాడ జిల్లా అన్నవరంలోని స్నేహ రెసిడెన్సీలో బౌద్ధ సదస్సు నిర్వహిస్తున్నట్లు మహాసభ అధ్యక్షులు జి.శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1955లో భారతీయ బౌద్ధ మహాసభ ప్రారంభించినట్లు చెప్పారు. మానవ కల్యాణానికి, సమాజ సంక్షేమానికి , దేశ పురరోభివృద్ధికి మార్గం చూపేది బౌద్ధ ధమ్మం మాతృ భూమిలో కనుమరుగవుతోందన్నారు.

కాంగ్రెస్ నేతల నిరసన

కాకినాడ: ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుకూరి పాండురంగా రావు ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ కార్యాలయం నుంచి కల్పన సెంటర్ వరకు నల్లజెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీ రాజు, సిటీ ఇన్‌చార్జి కోలా ప్రసాదవర్మ, నగర మహిళా అధ్యక్షురాలు బత్తిన లలిత ధనకోటి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య, జీవిత భద్రత

కరప: ప్రతి పేదకుటుంబానికి ఆరోగ్య, జీవిత భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రధాని మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ పేర్కొన్నారు. మండలం యండమూరులో శుక్రవారం సర్పంచ్ మార్రెళ్ల శివ అధ్యక్షతన జరిగిన వికసిత్ భారత సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వీరభద్రరావు, మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, కోఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా క్రిస్మస్ ఆరాధన



వేళంగి చర్చిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

కరప: మండలం వేళంగిలోని క్రైస్ట్ చాపల్ చర్చిలో శుక్రవారం పాస్టర్ రెవరెండ్ పి.సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ డానియల్ పాల్ క్రిస్మస్ సందేశమిచ్చారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. క్రిస్మస్ పాటలతో బాల, బాలికల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రచయిత ఎస్.రాజేష్, దైవజనులు రెవరెండ్ పి.స్పర్జన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

మోక్ష కారకం మాధవ దర్శనం

- వైకుంఠ ఏకాదశికి వైష్ణవాలయాల ముస్తాబు
- ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు





విద్యుత్ కాంతుల నడుమ నగరంలోని వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం, సర్పవరం భావనారాయణ ఆలయం



భావనారాయణ ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

బోట్‌క్లబ్: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనం కల్పిస్తున్నారు. స్వామి వారి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆయా ఆలయ కమిటీలు దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శనం చేసేకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. భక్తుల తాకిడి నేపథ్యంలో బారికేడ్‌లు, క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి ప్రాకార సేవ చేయనున్నారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. వీలైనంత త్వరగా భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాతల సహకారంతో భక్తులు ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులను ఆకట్టుకొనేలా ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వరిపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్థానిక జగన్నాథపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో, పళ్లంరాజునగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, మెహర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోను ఉత్తరద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీల సభ్యులు తెలిపారు.

భావనారాయణుని దర్శనానికి..

కాకినాడ రూరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాలకు విష్ణు ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోనే పురాతన ప్రసిద్ధి గాంచిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జాము 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాల ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు, ఈఓ భీమశేఖర్, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని సర్పవరం జంక్షన్ వద్ద శ్రీదేవి, భూ దేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు ఆర్టీసీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పలు గ్రామాలలోని ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు.

పండగలా ఆడుదాం ఆంధ్ర పోటీలు



క్రీడల నిర్వహణపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను పండగలా నిర్వహించాలని, అందుకు అన్నిఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమై ఆడుదాం ఆంధ్ర పోటీలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ పోటీలను గ్రామ, మండలస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మహిళా క్రీడాకారులు ఎక్కువగా పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడలు ప్రారంభించి, నిర్వహించాలని ఆయన సూచించారు. డీఎల్‌డీఓ పాటంశెట్టి నారాయణమూర్తి, ఎంపీడీఓ కె.అప్పారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి



కరపలో ఉచిత గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, నాయకులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కరపలో వై ఏపీ నీడ్స్ జగన్

కరప: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అవినీతి రహిత పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో శుక్రవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి, సంస్కరణలు తీసుకువచ్చి పాలిస్తున్నందుకే జగన్ కావాలని, అర్హత ఉంటే వలంటీర్ స్వయంగా ఇంటికి వచ్చి పథకాలు అందిస్తున్నందుకు కావాలని, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను కంటికి రెప్పలా కాపాడుతున్నందుకు కావాలని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కొందరు రాజకీయ నాయకులు మాయమాటలు చెప్పటానికి సంక్రాంతికి వచ్చే గంగిరెద్దులు, హరిదాసులులాగా ప్రజల ముందుకు వస్తున్నారని, వారికి తగిన బుద్ధి ప్రజలే చెప్పాలన్నారు. మార్కెట్ వస్తువుకు ఎందుకు గ్యారంటీ ఇస్తారంటే సదరు వస్తువుపై నమ్మకంకలిగించేందుకని, అదే బ్రాండ్‌గల వస్తువుకు గ్యారంటీ అవసరంలేదని అలాగే ఒక ఇమేజ్, విజన్ ఉన్నా ముఖ్యమంత్రి జగన్ బ్రాండ్‌గా పేర్కొన్నారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. కరప–1 గ్రామసచివాలయం పరిధిలో రూ.45 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చే ఎన్నికలలో తనను, సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా వలంటీర్లకు వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్లను, తడి, పొడి చెత్త సేకరించేందుకు డస్ట్‌బిన్‌లను, ఉచిత గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా ఈశ్వరరావు, పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

గణితంతోనే దేశాభివృద్ధి

- జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ రవీంద్రనాథ్
- పీఆర్ కళాశాలలో గణిత దినోత్సవం



జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న బోధనా సిబ్బంది

బాలాజీచెరువు: గణితంతోనే దేశాభివృద్ధి సాధ్యమని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితంతో పట్టు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని, సుస్థిరమైన అభివృద్ధి సాధించినప్పుడే మానవ పురోగతి సాధ్యమౌతుందన్నారు. దేశాభివృద్ధి గణాంకాలపై ఆధారపడి ఉంటుందని, గణితావధాని శ్రీనివాసరామానుజన్‌ను ప్రతి గణిత విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు మాట్లాడుతూ రామానుజన్ రచించిన గ్రంథాలకు సమాధానాలు దొరకడం ప్రశ్నార్థకంగా మారిందని, ఆయన రచనలపై వందలాది మంది పరిశోధనలు చేసి డాక్టరేట్‌లు పొందారన్నారు. అనంతరం ప్రొఫెసర్ రవీంద్రను సత్కరించి గణిత శాస్త్రంపై నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎలియా, కె.జయదేవ్, చక్రవర్తి పాల్గొన్నారు. అలాగే ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గణితశాస్త్ర వేడుకల్లో విశ్రాంత గణిత శాస్త్ర అధ్యాపకులు సీహెచ్‌వీ రమణామూర్తి హాజరై విద్యార్థులు ప్రదర్శించిన గణితశాస్త్ర ప్రాజెక్టులు ప్రారంభించారు. కళాశాల కో ఆర్డినేటర్ బీఈవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో..

కాకినాడ రూరల్: మండలంలోని అచ్చంపేట జంక్షన్ నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో శుక్రవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత శాస్త్ర అధ్యాపకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ భరత ఖండం గణిత శాస్త్రానికి సంబంధించి ఎన్నో ఆవిష్కరణ చేసిందని, ఆర్యభట్ట, భాస్కర 2, బ్రహ్మగుప్త వంటి వారి అడుగుజాడల్లో శ్రీనివాస్ రామానుజన్ ఎన్నో ఆవిష్కరణలు చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యపకులు స్రవంతి దుర్గాభవాని, డాక్టరు శ్రీదేవి, డాక్టరు విజయశ్రీ, ఎస్తేర్ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

కరప: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం విశ్వవిఖ్యాత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. జాతీయ గణితదినోత్సవాన్ని పురస్కరించుకుని గణిత క్విజ్ నిర్వహించగా పదో తరగతి విద్యార్థులు కె.సాయిరాం, పి.రాజేష్ ప్రథమ, కె.రాజశేఖర్, ఎం.జాహ్నవి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. విద్యార్థినులకు గణిత సూత్రాలతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పి.భువన, ఎస్.వినీల ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగ గణిత, సైన్స్ ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గురజనాపల్లిలో గణిత సూత్రాలతో ముగ్గులు వేసిన విద్యార్థినులు



నన్నయ పీజీ సెంటర్‌లో రామానుజన్‌కు నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

మార్పులను అధిగమిస్తూ సాగిపోవాలి

కాకినాడ సిటీ: సామాజిక, సాంకేతిక మార్పులను అర్థం చేసుకుని ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరవచ్చని జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు, సంకురాత్రి చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శుక్రవారం అలూమ్ని ఆడిటోరియంలో సైన్స్ అండ్ టెక్నాలజీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, విశిష్ట అతిథిగా సంకురాత్రి ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సమాజ సేవపై ఆసక్తి కనబర్చాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సంకురాత్రి చంద్రశేఖర్ నివృత్తి చేశారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రత్యేకాధికారులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాండవ్య నారాయణుని దర్శనానికి ఏర్పాట్లు

సామర్లకోట: ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్థానిక పురాతన విష్ణు ఆలయం మాండవ్యనారాయణస్వామి ఆలయంలో తెల్లవారు జామున స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పూజలు జరుగుతాయని అర్చకులు చక్రవర్తుల రఘురామ్, రవికుమార్ తెలిపారు. తెల్లవారు జాము 4 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, మధ్యాహ్నం స్వామి వారి గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రతి రోజు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేస్తున్నారు. 14న గోదా కల్యాణంతో ధనుర్మాస పూజలు ముగుస్తాయి. అదే విధంగా వేట్లపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం దర్శనానికి ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తెలిపారు.

లైంగిక వేధింపుల నివారణకు సదస్సు

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మహిళలు పని చేస్తున్న ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు సంబంధించి పరిష్కారాలు, చట్టాలపై శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి కె.ప్రవీణ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీఓ కేబీ సౌజన్య, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్ బుల్లిరాణి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, న్యాయవాది డీవీఎస్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి



ప్రజారోగ్య విభాగంపై సమీక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

- కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: పారిశుధ్య కార్మికులు ప్రజారోగ్య పరిరక్షణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపైనా శ్రద్ధ తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. పురపరిపాలనశాఖ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ప్రజారోగ్య విభాగంపై సమీక్షించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఏఐటీయూసీ, సీఐటీయూ, వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, నగరంలోని 14 సర్కిళ్ల నుంచి 14 మంది కార్మికులు హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, సరెండర్ లీవ్ వంటి ప్రయోజనాలు, కారుణ్య నియామకాలు, ఆరోగ్య బీమా తదితర అన్ని అంశాలను పరిష్కరించేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. అదే సమయంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ ద్వారా ప్రజారోగ్య పరిరక్షణలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో డీఈ లోవరాజు, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, కార్మిక ప్రతినిధులు పలివెల వీరబాబు, తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి కలిగించేలా ఆడుదాం ఆంధ్రా..

యువతలో క్రీడాస్ఫూర్తిని కలిగించేలా ఆడుదాం ఆంధ్రా నిర్వహించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కమిషనర్ నాగనరసింహారావు సూచించారు. ఈ మేరకు స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలకు దాదాపు 23వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి

ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఈ అంశంపై ఆయన అధికారులతో సమీక్షించారు. సమావేశంలో కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా సాగుతున్నారు..

- సంక్షేమ పథకాలతో రైతులకు లబ్ధి
- సీఎం జగన్ పాలనలో రైతే రాజు
- నేడు జాతీయ వ్యవసాయ దినోత్సవం



వరినాట్లకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

కాకినాడ సిటీ: టీడీపీ ఐదేళ్ల పాలనలో ప్రకృతి కరుణించక, పంటలు పండక, గిట్టుబాటు ధరలు లేక రైతు చిత్తుగా మారాడు. రైతును రాజుగా నిలపాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతులో భరోసా నింపేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో అన్నదాత వ్యవసాయాన్ని పండగలా భావిస్తున్నారు.

టీడీపీ పాలనలో అలా..

టీడీపీ పాలనలో సాగు వ్యయం భారమై రైతులు అల్లాడిపోయేవారు. గిట్టుబాటు ధర ఇవ్వకపోగా, బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. అలాగే రుణమాఫీ సైతం చేయకపోవడంతో పూర్తిగా అన్నదాత పూర్తిగా అప్పులపాలై ఆత్మహత్యలను ఆశ్రయించిన ఘటనలెన్నో చూశాం.

జగనన్న పాలనలో ఇలా..

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుంటూ అన్ని వర్గాల మన్ననలు పొందుతోంది. రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500, అలాగే పంట బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించడం, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు ఏ సమాచారం కావలసి వచ్చినా వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి రైతుల సమస్యలు తీరుస్తున్నారు. ఆర్బీకేలో కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర ఇవ్వడంతో వారిలో ఆనందం కనిపిస్తోంది. పంట నష్టపోతే 15, 20 రోజుల్లో పరిహారం అందించడం, పలు సంక్షేమ పథకాలను రైతుల ముంగిటకు చేర్చింది ఈ ప్రభుత్వం. ఉచితంగా బోర్లు వేసే పథకాన్ని ప్రకటించడంతో పాటు ఉచిత విద్యుత్ పగటి పూట 9 గంటలు ఇచ్చి రైతులకు మళ్లీ వ్యవసాయంపై ఆసక్తి చూపేలా చేశారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని పంటలపై అవగాహన కల్పిస్తున్నారు.

రైతుల ప్రయోజనాలే ముఖ్యం



సీఎం జగన్ రైతుల ప్రయోజనాలకే ప్రాముఖ్యం ఇస్తున్నారు. చంద్రబాబు కేవలం తమ ఉనికి కోసం రైతులను పక్కదారి పట్టించాలని చూస్తున్నారు. రైతు సంక్షేమానికి ఆటంకం కల్పించాలని ఇప్పటికీ కపట నాటకాలు ఆడుతున్నారు. జగనన్న పాలనలో పుష్కలంగా వానలు కురిసాయి. రైతులు సంతోషంగా ఉన్నారు.

– పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ కరప

రైతు బాంధవుడు సీఎం జగన్



నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్ రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల వారు ఎంతో సంతోషంగా ఉండి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకున్నారు. రైతులకు గిట్టుధర కల్పించడంతో ఆనందంగా ఉంటున్నారు. ఇలా రైతు గురించి ఆలోచించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉంటే రైతులకు ఎటువంటి కష్టాలు ఉండవు.

– నురుకుర్తి రామకృష్ణ, జెడ్పీటీసీ, కాకినాడ రూరల్ మండలం

25న తెలుగు పాటల పోటీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఘంటసాల కళాపీఠం, సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో 25వ తేదీ సోమవారం స్థానిక సూర్యకళామందిరంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి తెలుగు పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళావేదిక అధ్యక్ష, కార్యదర్శులు కర్రి అచ్యుతరామారెడ్డి, పంపన దయానందబాబు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి పాటల పోటీలు, స్వరాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశభక్తి, జానపదం, సినిమా, శాస్త్రీయ సంగీతం ఏదైనా ఒక తెలుగు పాట మాత్రమే పాడాలన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగే పోటీలకు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సీనియర్స్ విభాగంలో పాల్గొనేవారు 99661 98404 , జూనియర్ విభాగంలో పాల్గొనే వారు 99121 07983 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఎటువంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విజేతలకు నగదు బహుమతి అందిస్తామన్నారు.